నమస్తే తెలంగాణ







రామన్నపేటలో ప్రజాభిప్రాయ సేకరణకు భారీగా తరలివస్తున్న ప్రజలు, పక్కన ప్రజాభిప్రాయసేకరణలో అడిషనల్ కలెక్టర్ కారును అడ్డుకుంటున్న స్థానికులు

# అదానీ..గోబ్యాక్!

**ముక్తకంఠంతో నినదించిన రామన్నపేట • అంబుజా కంపెనీకి వ్యతిరేకంగా భారీగా తరలొచ్చిన జనం**

- నల్లజెండాలు, బ్యాడ్జీలతో నినాదాల హోరు
- ఫ్యాక్టరీ వద్దంటూ అందరూ ఒక్కటే స్వరం
- అభిప్రాయాలు వెల్లడించిన స్థానికులు
- కంపెనీకి మద్దతుగా పెయిడ్ స్థానికేతరులు
- వారిని గుర్తుపట్టి తరిమికొట్టిన స్థానికులు
- ప్రజాభిప్రాయసేకరణ రెండు గంటలే
- ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తాం: అడిషనల్ కలెక్టర్ షాలోమ్

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్23(నమస్తే తెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో అదానీకి చెందిన అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటుకు స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అంబుజా సిమెంట్స్ లిమిటెడ్ (గ్రూప్ కంపెనీ ఆఫ్ అదానీ) కంపెనీ ఫ్యాక్టరీ ఏర్పాటుపై బుధవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఆద్యంతం ఒక్కటే నినాదం మార్మోగింది. అదానీ గోబ్యాక్... అంబుజా సిమెంట్స్ గోబ్యాక్ అంటూ స్థానిక జనం చేసిన నినాదాలతో ప్రజాభిప్రాయ సేకరణ ప్రాంతమంతా హోరెత్తింది. రామన్నపేట మండల కేంద్రానికి ఆనుకుని కంపెనీ ప్రతిపాదిత స్థలంలో కాలుష్య నియంత్రణ మండలి, నల్లగొండ వారి ఆధ్వర్యంలో కంపెనీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్ నేతృత్వంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణకు భారీగా రామన్నపేట ప్రాంత ప్రజలు తరలివచ్చారు. ప్రజాభిప్రాయ సేకరణ ఉదయం 11గంటల నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా 9గంటల వరకే పెద్దఎత్తున ప్రజలు అక్కడికి చేరుకున్నారు. కొంతకాలంగా అదానీ సిమెంట్ కంపెనీకి వ్యతిరేకంగా స్థానికులంతా అఖిలపక్షంగా ఏర్పడి పర్యావరణ పరిరక్షణ వేదిక పేరుతో పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం వీరితో పాటు స్థానిక ప్రజలు రాజకీయాలకు అతీతంగా స్వచ్ఛందంగా తరలివచ్చారు. మహిళలు కొన్ని గ్రామాల నుంచి ట్రాక్టర్లపై తరలిరావడం విశేషం. ఇక్కడికి వచ్చిన వారంతా సిమెంట్ ఫ్యాక్టరీని ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకుంటామని హెచ్చరించారు.




గో బ్యాక్ అంబుజా అంటూ నల్ల బ్యాడ్జీలు, నల్ల జెండాలతో యువకుల వినూత్న నిరసన

### ప్రభుత్వానికి నివేదిస్తాం

అంబుజా సిమెంట్ కంపెనీ ప్రతిపాదనపై ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అభిప్రాయాలన్నింటినీ ప్రభుత్వానికి నివేదిస్తాం. ప్రతి ఒక్కరి అభిప్రాయాన్ని వీడియో చిత్రీకరణతో పాటు రికార్డు చేశాం. రాతపూర్వకంగానూ కొందరు అభిప్రాయాలు తెలిపారు. వీరందిరి అభిప్రాయాలను తదుపరి చర్యల కోసం ప్రభుత్వానికి అందజేస్తాం.

– అడిషనల్ కలెక్టర్ బెన్ షాలోమ్

### అడుగడుగునా ఆటంకాలే...

అదానీ ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున ప్రజలు తరలివస్తారని కంపెనీ ప్రతినిధులు ముందే ఊహించినట్టున్నారు. అడుగడుగునా ప్రజలు అక్కడికి రాకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. అందుకు పూర్తిస్థాయిలో ప్రభుత్వ సహకారం కూడా తీసుకున్నట్టు స్పష్టమైంది. ముందు జాగ్రత్తగా ప్రజాభిప్రాయ సేకరణ స్థలంలో పోలీసులను మోహరించడం పరిపాటి. కానీ అదానీ కంపెనీ ప్రజాభిప్రాయ సేకరణలో రామన్నపేట చుట్టూ పోలీసులను మోహరించారు. రామన్నపేటకు వచ్చే అన్ని దారుల్లోనూ పోలీసు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ప్రతి వాహనాన్ని ఆపి ఎక్కడి వెళ్తున్నారు... ఏ పార్టీ వాళ్లు? అంటూ ప్రశ్నలతో వేధించారు. ఇదే సమయంలో ప్రజాభిప్రాయ సేకరణ స్థలాన్ని వ్యూహాత్మకంగా రోడ్డు నుంచి సుమారు రెండున్నర కిలోమీటర్ల లోపల ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. రామన్నపేట నుంచి కొమ్మాయిగూడెం వెళ్లే రూట్లో కంపెనీ ప్రధాన గేట్ ఉంది. ఇక్కడ పలువురు సీఐలు, ఎస్ఐలు ఉండి ప్రతి ఒక్కరి ఆధార్‌కార్డును తనిఖీ చేశారు. రామన్నపేట మండలానికి చెందిన వారైతేనే లోపలికి అనుమతించారు. ఇక్కడ పలుమార్లు పోలీసులకు ప్రజలకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అక్కడి నుంచి వాహనం ఉంటే తప్ప ప్రజాభిప్రాయ సేకరణ స్థలానికి వెళ్లే పరిస్థితి లేదు. దీంతో కాలినడక వచ్చే వాళ్లు అక్కడికి చేరుకునే అవకాశం లేకుండా చేశారు. అయినా సరే వందలాది వాహనాలపై ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడి చేరుకున్నారు.

### నల్లబ్యాడ్జీలు... ప్లకార్డులతో నినాదాలు

ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన ప్రజలంతా నల్లబ్యాడ్జీలు, నల్లజెండాలతో పట్టుకుని 'అంబుజా సిమెంట్స్ మా కొద్దు.. అదానీ గోబ్యాక్' అంటూ ప్లకార్డులు, పోస్టర్లను ప్రదర్శించి నిరసన తెలిపారు. ముందుగా ప్రజాభిప్రాయ సేకరణ స్థలం ఎదురుగా బైఠాయించి పెద్దఎత్తున ధర్నాకు దిగారు. ఇదే సమయంలో అడిషనల్ కలెక్టర్ బెన్ షాలోమ్, చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సంగీత భారీ పోలీసు బందోబస్తు మధ్య వేదిక వద్దకు చేరుకున్నారు. వీరు చేరుకునే సమయంలోనే షెడ్‌లోని ప్రజలు అదానీ సిమెంట్స్ గోబ్యాక్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. ముందుగా కంపెనీ ప్రతినిధి సుబ్బ లక్ష్మణ్ మాట్లాడేందుకు సిద్ధం కాగా పెద్ద ఎత్తున అరుపులు కేకలు, ఈలలతో గో బ్యాక్ అంటూ ముక్తకంఠంతో నినాదాలు చేశారు. ప్రజల నిరసన మధ్యనే కంపెనీ ప్రతినిధి సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతిపాదన వివరాలను వెల్లడించారు. ప్రజలు నిరసనల హోరులో ఆయన ఏం చెప్తున్నారో ఎవ్వరికీ అర్థంకాక గందరగోళం నెలకొంది. ఆ తర్వాత స్థానికుల నుంచి ముందుగా పేర్లను తీసుకుని ఒక్కొక్కరినీ మాట్లాడించగా 25 మంది తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఇందులో రాజకీయ పార్టీల నేతలతో పాటు ప్రజాసంఘాలు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు ఉన్నారు. వీరందరూ ఏకాభిప్రాయంగా ఇక్కడ కంపెనీ వద్దే వద్దు అంటూ తమ అభిప్రాయాలను వెల్లడిస్తూ రాతపూర్వకంగానే తమ అభ్యంతరాలను అధికారులకు అందజేశారు. బీఆర్‌ఎస్, సీపీఎం, కాంగ్రెస్, టీడీపీ, గొర్రెల మేకల సంఘం, మత్స్యకార్మిక సంఘం, గీత సంఘం, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బార్ అసోషియేషన్ ప్రతినిధులు ఇందులో పాల్గొనగా అందరూ పార్టీలకు అతీతంగా ఫ్యాక్టరీని వ్యతిరేకించారు.

### కంపెనీ ప్రతినిధుల కుట్రలు

ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికుల నుంచి మద్దతు లభించేలాలేదని కంపెనీ ప్రతినిధులు పలు స్వచ్ఛంద సంస్థలను సంప్రదించినట్టు తెలిసింది. వారికి ముందే డబ్బు, ఇతర ప్రలోభాలకు గురిచేసి ఇక్కడికి వచ్చేలా ప్లాన్ చేశారు. ఇతర ప్రాంతాలకు చెందిన వీరంతా ముందే ప్రజాభిప్రాయ సేకరణ స్థలానికి చేరుకున్నారు. వీరిని గమనించిన స్థానికులు మీరు ఎక్కడి నుంచి వచ్చారు? ఎందుకు వచ్చారు? ఎవరు రమ్మన్నారు? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. తాము స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులమని, కంపెనీ వాళ్లు రమ్మంటే వచ్చామని చెప్తుండగా స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కంపెనీకి అనుకూలంగా వచ్చిన పెయిడ్ ప్రతినిధులు అక్కడి నుంచి జారుకోక తప్పలేదు.



## అదానీకి మేలు.. తెలంగాణకు కీడా?

**సర్కారు తీరుపై కేటీఆర్, హరీశ్‌రావు ఫైర్**

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): అదానీకి మేలు చేయటం కోసం తెలంగాణకు కీడు చేస్తారా? అని రేవంత్ సర్కార్ తీరుపై బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన బీఆర్‌ఎస్ నేతలను గృహనిర్బంధాలు, అరెస్టులు చేయటమే ప్రజాపాలనా? అని నిప్పులు చెరిగారు. నల్లగొండ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్‌నాయక్, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి, గాదరి కిశోర్, చిరుమర్తి లింగయ్య తదితరులను ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా అడ్డుకోవడం నియంతృత్వమే అవుతుందని విమర్శించారు. తమ పార్టీ నేతలతోపాటు ప్రజాసంఘాల ప్రతినిధులు, పర్యావరణవేత్తలను ముందస్తు అరెస్టులు చేసి భయభ్రాంతులకు గురిచేయడం రేవంత్ సర్కారు అణచివేత చర్యలకు పరాకాష్ట అని నిప్పులు చెరిగారు. అదానీ ఆదేశాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో సాగిస్తున్న అరాచక పర్వాన్ని అడ్డుకొని తీరుతామని స్పష్టంచేశారు. పోలీసుల అక్రమ అరెస్టులను వారు తీవ్రంగా ఖండించారు. ప్రజాభిప్రాయసేకరణ నిర్బంధాల మధ్య చేయడం అప్రజాస్వామికమని, ప్రజాపాలన అని గొప్పలు చెప్పుకుంటూ నిర్బంధపాలన సాగించటం సిగ్గుచేటని మండిపడ్డారు.కాంగ్రెస్ సర్కారుకు దుమ్ముంటే నిర్బంధాలులేని ప్రజాభిప్రాయసేకరణ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్‌కు ప్రజలే మరణశాసనం రాస్తారని హెచ్చరించారు. అక్రమంగా అరెస్టు చేసిన బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాసంఘాల నేతలు, పర్యావరణవేత్తలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



ప్రజాభిప్రాయ సేకరణకు ట్రాక్టర్లలో తరలివెళ్తున్న మహిళలు




ఫ్యాక్టరీని రద్దు చేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నాయకులు

# ఫ్యాక్టరీని అడ్డుకుంటాం

- సిమెంట్ ఫ్యాక్టరీపై మంత్రుల వైఖరేంటి?
- ప్రజాభిప్రాయానికి ఎందుకు రాలేదు?
- బీఆర్‌ఎస్ నేతలను అడ్డుకోవడమెందుకు?
- బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

నల్లగొండ, అక్టోబర్ 23 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రామన్నపేటలో అదానీ గ్రూప్ చేపడుతున్న అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణంపై మంత్రుల వైఖరి తెలియజేయాలని బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ డిమాండ్ చేశారు. నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, గాదరి కిశోర్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నోముల భగత్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. సిమెంట్ ఫ్యాక్టరీ కోసం ప్రజాభిప్రాయానికి మంత్రులు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యేలుగా మమ్మల్ని హాజరుకానివ్వకుండా అరెస్ట్ చేయించటంలో కుట్ర ఏందో చెప్పాలని నిలదీశారు. బీఆర్‌ఎస్ నేతలను గృహనిర్బంధం చేసి, పోలీసుల పహారాలో ప్రజాభిప్రాయ సేకరణ చేయటం ఏమిటని మండిపడ్డారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని అడ్డుకొని తీరుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నేతలు చెరుకు సుధాకర్ గౌడ్, మందడి సైదిరెడ్డి, బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పొలాలను నాశనం చేస్తే ఊరుకోం

నకిరేకల్ నియోజకవర్గంలోని 12 గ్రామాల్లో పచ్చని పంట పొలాలను నాశనం చేస్తామంటే ఉపేక్షించేది లేదు. ప్రజాభిప్రాయ సేకరణ పోలీసుల మధ్య పెట్టడం ఎందుకు ? రామన్నపేట నాశనం కాకుండా ఉండాలంటే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు వెంటనే స్పందించాలి.

– చిరుమర్తి లింగయ్య, మాజీ ఎమ్మెల్యే

### కోమటిరెడ్డి బ్రదర్స్ వైఖరేంది?


డ్రైపోర్ట్ పేరుతో భూసేకరణ చేసి ఇప్పుడు సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టి ప్రజల నోట్లో దుమ్ము కొట్టే ప్రయత్నం అదానీ చేస్తున్నాడు. దీనిపై కోమటిరెడ్డి బ్రదర్స్ తమ వైఖరి చెప్పాలి. మోదీ కనుసన్నల్లో అదానీ హైదరాబాద్‌కు వస్తుంటే రేవంత్ స్వాగతం పలుకుతున్నాడు. రామన్నపేటలో జనం వద్దని గగ్గోలు పెడుతుంటే మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కడికి పోయారు ?

– కంచర్ల భూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

### కోదండరాం,హరగోపాల్ స్పందించాలి

సిమెంట్ ఫ్యాక్టరీ వద్దని ప్రజలు వ్యతిరేకిస్తున్నా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎందుకు హాజరు కాలేదు? ప్రజలకు ఇష్టంలేని ప్రాజెక్టుపై ప్రొఫెసర్ హరగోపాల్, కోదండరామ్ ఎందుకు స్పందించటం లేదు? ప్రస్తుతం రేవంత్ రెడ్డిని రాష్ట్రంలో తిట్టని వాళ్లే లేరు. సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల జరిగే నష్టం మండలి చైర్మన్ గుత్తాకు తెల్వదా? దానిపై ఎందుకు మాట్లాడటం లేదు ? చీకటి ఒప్పందాలతో ముందుకు సాగుతున్న బీజేపీ, కాంగ్రెస్‌లకు బీఆర్‌ఎస్సే కళ్లెం వేస్తుంది.

– గాదరి కిశోర్ కుమార్, మాజీ ఎమ్మెల్యే, తుంగతుర్తి



నల్లగొండలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్. చిత్రంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, గాదరి కిశోర్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్, బీఆర్‌ఎస్ నేత చెరుకు సుధాకర్ తదితరులు



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

# జనావాసాల్లో కంపెనీ వద్దు

- ప్రజల ఆవేదనను అర్థం చేసుకోవాలి
- కులవృత్తులకు తీవ్ర విఘాతం
- ఫ్యాక్టరీకి అనుమతులు రద్దు చేయాలి
- ప్రజల పోరాటాలకు బీఆర్‌ఎస్ మద్దతు
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): రామన్నపేట లో జనావాసాల మధ్య తలపెట్టిన అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. ఇక్క డి ప్రజల ఆవేదనకు, ఆందోళనలకు బీఆర్‌ఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నదని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి ప్రకటించారు. బుధవారం రామన్నపేటలో అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన పాల్గొన్నారు. అడుగడుగునా పోలీసుల అడ్డగింతలు, తనిఖీల నడుమ.. ఈ ప్రాంత ప్రజాప్రతినిధిగా అభిప్రాయం చెప్పి వెళ్లితీరుతానంటూ పోలీసులను హెచ్చరిస్తూ అక్కడికి చేరుకోవాల్సి వచ్చింది. అభిప్రాయ సేకరణలో భాగంగా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టేలా స్పష్టం చేశారు.'వ్యక్తిగతంగా నేను గానీ, ఇక్కడి ప్రజలుగా గానీ పరిశ్రమల ఏర్పాటుకు వ్యతిరేకం కాదు.. కానీ పరిశ్రమ ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలం జనావాసాలకు దూరంగా ఉండాలి. వ్యవసాయేతర ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఎవ్వరికీ అభ్యంతరం ఉండదు. డ్రైపోర్టు ఏర్పాటు చేస్తామని ప్రజలను మభ్యపెట్టి.. అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని తెర మీదకు తెచ్చారు. దీన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రజల ఆందోళనలు, నిరసనలను గమనంలోకి తీసుకుని అనుమతులు రద్దు చేసే దిశగా సిఫార్సులు ఉండాలి. రామన్నపేటలో చేనేత, మత్స్య, గీత లాంటి వృత్తిదారులతో పాటు వ్యవసాయమే ప్రధాన జీవనంగా ప్రజలు జీవిస్తున్నారు. గతంలో ఈ ప్రాంత వ్యవసాయ రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురి కాగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అయ్యాక కేసీఆర్ నాయకత్వంలో పెండింగ్‌లో ఉన్న అనేక ప్రాజెక్టులకు నిధులివ్వడంతో వ్యవసాయం రంగం కోలుకుంటుంది. ఇలాంటి తరుణంలో అంబుజా సమయంలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు అనేది మళ్లీ వ్యవసాయ రంగాన్ని దెబ్బకొట్టడమే. కులవృత్తులు దెబ్బతిని, వ్యవసాయం దివాళీ తీసే ప్రమాదం ఉంది. ఇక్కడి ప్రజల, ఈ ప్రాంత భవిష్యత్తు అగమ్యగోచరంగా మారే ప్రమాదం ఉంది. ఇది సమంజసం కాదు. ఈ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ఇటు యాజమాన్యం, అటు ప్రభుత్వం ప్రజల ఆవేదనను, నిరసనను అర్థం చేసుకోవాలి. ఇక్కడ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కరెక్టు కాదు. దీన్ని నేను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న. ఫ్యాక్టరీ ఏర్పాటును విరమించుకునే వరకూ సకల జనులు నిరసన కార్యక్రమాలు చేపట్టాలి. దానికి బీఆర్‌ఎస్ పక్షాన, ఎమ్మెల్సీగా సంపూర్ణ సహకారం ఉంటుంది. ప్రభుత్వం కూడా పునరాలోచన చేసి అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలి.' అని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం యాదాద్రి జిల్లా కార్యదర్శి ఎండీ జాహంగీర్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో ఆ ప్రాంతంలో ఫ్యాక్టరీ వద్దని స్పష్టం చేశారు. గొర్రెల మేకల సంఘం ప్రతినిధి కల్లూరి మల్లేశ్ మాట్లాడుతూ ఫ్యాక్టరీ కాలుష్యంతో కుల వృత్తులు నాశనం అవుతాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి మాట్లాడుతూ డ్రైపోర్ట్ ఏర్పాటు చేస్తామని చెప్పి సిమెంట్ ఫ్యాక్టరీ పెడుతూ మోసం చేయడం తగదని అన్నారు.

### లోకం పోకడ




'రైతు భరోసా' విత్తనం నాటామని చెప్పారు.. వర్షాకాలం పోయినా ఇంకా మొలకెత్తదేం?!



ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్తున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్‌ను అడ్డుకుని అరెస్టు చేస్తున్న పోలీసులు




రామన్నపేటలో ప్రజాభిప్రాయ సేకరణకు హాజరయ్యేందుకు వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను అరెస్టు చేస్తున్న పోలీసులు



రామన్నపేటలో జరిగిన ప్రజాభిప్రాయసేకరణలో సిమెంట్ ఫ్యాక్టరీ వద్దని అధికారులకు తెలుపుతున్న బీఆర్‌ఎస్వీ నేత కడారి స్వామి యాదవ్

# సిమెంట్ ఫ్యాక్టరీని అడ్డుకుంటాం

**బీఆర్‌ఎస్ నేతల అరెస్టు ఖండిస్తున్నం**

**మరోసారి ప్రజాభిప్రాయం సేకరించండి**

**మీడియాతో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి**

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): రామన్నపేటలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయకుండా చివరి వరకు అడ్డుకుంటామని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ నల్లగొండ జిల్లా రామన్నపేటలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే ఆ మండలం అంతా నాశనమవుతుందని మండిపడ్డారు. ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్‌ను పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండించారు. సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే రామన్నపేట మండలంలో మూగజీవాలకు గడ్డి దొరకదని ఆవేదన వ్యక్తంచేశారు. అవసరమైతే మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నల్గొండకు మూసీ ద్వారా త్రాగునీరు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీ ఎలా కడతారు అని ప్రశ్నించారు. తెలంగాణలో మోడీ, రేవంత్ మిలాఖత్ గురించి స్పష్టమవుతోందని పేర్కొన్నారు.



తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తదితరులు